క్లుప్తంగా

విద్యార్థులను అభినందించిన డీఎస్పీ



మహబూబ్‌నగర్ క్రీడలు: ఆర్‌కే స్పోర్ట్స్ కరాటేదూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి ఎంపీ కప్ కరాటే పోటీల్లో కటా కేటగిరిలో గ్రాండ్ చాంపియన్‌షిప్‌లు సాధించిన విద్యార్థులను డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం అభినందించారు. అకాడమీ ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల కటా బ్లాక్‌బెల్టులో వర్షిని, బ్రౌన్‌బెల్టులో నవ్య, కలర్ బెల్టులో ఆరాధ్య, వినూత్న, బాలుర విభాగంలో బ్రౌన్‌బెల్టులో రాహుల్, కలర్ బెల్టులో రేవంత్, గణేష్, వైట్‌బెల్టులో రితిక్ గ్రాండ్ చాంపియన్‌షిప్‌లు సాధించినట్లు తెలిపారు. అకాడమీ సలహాదారులు ఎంఎస్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం చురుగ్గా సాగాలి

నవాబుపేట: మొక్కల పెంపకం చురుకుగా సాగాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని కూచూర్, హన్మసానిపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో మండల అధికారులు నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై పంచాయతీ అధికారులతో ఆరాతీశారు. గ్రామాల్లో అవసరమైన మొక్కలను పెంచుకోవాలని ఎంపీడీఓ సూచించారు. పంచాయతీ సిబ్బంది నర్సరీలపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట అధికారులు బద్రునాయక్, జ్యోతి, రాజేష్, కల్పన తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చిన్నచింతకుంట: కొౌకుంట్ల మండలం అప్పంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పంచాయతీ కార్యదర్శి సాయిమమత, పీఆర్ ఏఈ శివకుమార్ మంగళవారం పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు బోయ నర్సింహులు, అప్పంపల్లి సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శాంతిరెడ్డి, సంజన్న, కుమ్మరి నర్సింహులు, పి.రాఘవరెడ్డి, సీతన్న, నాగిరెడ్డి ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

రాజాపూర్(బాలానగర్): మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాగివాహనాలు నడిపి ప్రమాదాల బారినపడి కుటుంబసభ్యులకు దూరం కావద్దని అన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్లకు వచ్చే ప్రకటనలు, సందేశాలకు స్పందించి మోసపోవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైన అనుమానితులు ఉంటే పోలీస్ సిబ్బందికి సమాచారమివ్వాలని ప్రజలను కోరారు.

శ్రద్ధతో చదివి ఉత్తీర్ణత సాధించాలి



చిన్నచింతకుంట: పదో తరగతి విద్యార్థినులు ప్రత్యేక శ్రద్ధతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ మురళీకృష్ణ అన్నారు. మండలంలో కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గది, సామగ్రి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు.

'స్థానికం'లో రజకులకు సీట్లు కేటాయించాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులకు సీట్లు కేటాయించాలని నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటై 11ఏళ్లు కావస్తున్నా రజకుల స్థితిగతుల్లో ఎలాంటి మార్పులు లేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రఅధ్యక్షుడు గోపి, ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు శివన్న, అధ్యక్షుడు నాగన్న, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు రాజు, బాలకృష్ణ తదితరులున్నారు.

కమనీయం.. చెన్నకేశవుడి కల్యాణం

- ఆలయంలో ప్రత్యేక పూజలు
- మహాసుదర్శన సామూహిక హోమాలు
- పోటెత్తిన భక్తులు



దేవరకద్రలో చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయంలో మంగళవారం కల్యాణం ఘనంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణలో పూజలు చేశారు. మధ్యాహ్నం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వేదికపై శ్రీదేవి భూదేవి సమేతంగా కొలువుదీరిన చెన్నకేశవస్వామికి వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ఈసందర్భంగా పెద్దఎత్తున మహిళా భక్తులు హాజరై అమ్మవార్లకు వడి బియ్యం పోసే కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలతో దేవాలయం అంతా భక్తులతో కిక్కిరిసి పోయింది.

నేడు రథోత్సవం...

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు రథోత్సవం నిర్వహించడానికి దేవస్థానం వారు భారీఎత్తున ఏర్పాటు చేశారు. రంగులు వేసి స్వామి రథాన్ని సిద్ధంచేశారు. రథోత్సవం అనంతరం స్వామివారి పల్లకిసేవ, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దేవునిబావి వద్ద గంగపూజ

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామంలో వెలిసిన శ్రీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి కల్యాణం జరిపించారు. ఉత్సవాల నిర్వాహకులు ఆలయానికి సమీపంలో ఉన్న దేవుని బావి వద్దకు వెళ్లిన పండితులు అక్కడ గంగపూజ నిర్వహించారు. అనంతరం గంగను ఆలయానికి తెచ్చి స్వామివారి మూలవిరాట్‌ను గంగతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి వేద మంత్రోచ్ఛరణల మధ్య లక్ష్మిచెన్నకేశవస్వామి కల్యాణాన్ని జరిపించారు. మహా సుదర్శన సామూహిక హోమాలను నిర్వహించారు. గ్రామపెద్దలు గవిని చెన్నారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన అంజన్న వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం శ్రీనివాసకాలనీలోగల శ్రీపంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం 21వ వార్షికోత్సవం మంగళవారం ముగిసింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సహిత శ్రీలక్ష్మివేంకటేశ్వరస్వామి వారికి అభిషేకం, మహాసుదర్శన హోమం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. సాయంత్రం దేవాలయం ఆవరణలో వైభవంగా స్వామివారి రథోత్సవం కొనసాగింది. ఈ పూజల్లో దేవాలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో స్వామివారి పూజల్లో పాల్గొన్న భక్తులు

'బీసీల సంఖ్య తగ్గించి చూపారు'

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన సమగ్ర సర్వేలో బీసీల సంఖ్యను తగ్గించి చూ యించారని బీసీ జాగృతిసేన మండలాధ్యక్షుడు నిరంజన్, ప్రధానకార్యదర్శి నర్సింహులు ఆరోపించారు. స్థానిక ఎమ్మార్పీస్ ప్రాంగణంలో పూలే దంపతుల విగ్రహాల వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఇవ్వకుండా చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీసీజాగృతి సేన నాయకులు సురభివిజయ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు భీంరాజ్, గోపాల్, శివరాములు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

నవాబుపేట: మండలంలోని గురుకుంట గ్రామానికి చెందిన చెన్నయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం మృతుడి భార్య లక్ష్మమ్మకు అతడి మిత్రబృందం రూ.37వేల ఆర్థిక సాయం అందించింది. వారిని మండల ప్రజల అభినందించారు. సత్యం, రాజశేఖర్‌రెడ్డి, యాదయ్య, బాస్కర్, ఆనంద్, వెంకటయ్య, ప్రేమ్‌రాజ్, రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం

మహబూబ్‌నగర్ క్రీడలు: ఈనెల 2వ తేదీన జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపీ కప్ కరాటే పోటీల్లో ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థి వర్షిణి కటా బ్లాక్‌బెల్టు కేటగిరిలో ప్రథమ స్థానంలో నిలిచింది. మంగళవారం విద్యార్థినిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించారు.

సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

జడ్చర్ల టౌన్: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీని మంగళవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గోపాల్‌నాయక్, గౌరవాధ్యక్షుడిగా గోవింద్‌నాయక్, కన్వీనర్‌గా రమేష్‌నాయక్, సమన్వయకర్తలుగా శంకర్‌నాయక్, చైతన్యచౌహాన్, కోకన్వీనర్‌గా లోకేష్‌నాయక్, ప్రధానకార్యదర్శులుగా గాంగ్యనాయక్, రాంచందర్‌నాయక్, బిచ్యానాయక్, ఉపాధ్యక్షులుగా సంతోష్‌నాయక్, శంకర్ చౌహాన్, మహేష్‌నాయక్, వెంకట్‌నాయక్, పాండుచౌమన్, నారాయణ, కోశాధికారిగా రాజునాయక్, కార్యదర్శులుగా కిషన్‌నాయక్, వైజాగ్‌శంకర్, బాలకోటి, వెంకటేశ్‌నాయక్, రమేష్‌నాయక్, కళ్యాణ్‌నాయక్ ఎన్నికయ్యారు. ఈనెల 15న జయంతి ఉత్సవంలో భాగంగా ర్యాలీ, సభ అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని కమిటీ నిర్ణయించింది.

విద్యార్థుల సూర్యనమస్కారాలు

జడ్చర్ల టౌన్: రథసప్తమి పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో విద్యార్థులు సూర్యనమస్కారాలు వేశారు. సూర్యనమస్కారాలతో ఆరోగ్యంగా ఉండగలుగుతామని ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఉదయం తప్పనిసరిగా సూర్యనమస్కారాలు చేయటం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఆయిల్ మిల్లు నిర్వాహకులకు నోటీసులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వరిపొట్టు ద్వారా దుమ్ము, ధూళి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ బోయపల్లి (వార్డు నం.16) టంకర రోడ్డులోని ఆయిల్ మిల్లు నిర్వాహకులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈమిల్లు ద్వారా తమ పొంట పొలాలు పాడవుతున్నాయంటూ ఈనెల 3న కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'కి బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం అక్కడికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్ రెడ్డి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లు నిర్వాహకులతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ వేరుశనగ పొట్టు బయటకు రాకుండా అన్నిరక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

దళితవాడను అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాతపాలమూరులోని దళితవాడను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని జ్ఞానసీలి మెరుపు బహుజన మహనీయు శోభాయాత్ర ఉమ్మడి జిల్లా నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలసి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికులు అధిక సంఖ్యలో జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి సరైన ఆర్థిక వనరులు లేక తమ పిల్లలను సరిగా చదివించుకోలేకపోతున్నారని అందులో పేర్కొన్నారు. అనంతరం కొత్త క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్ కుమార్, మాజీ కౌన్సిలర్ అంజయ్య, సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్, పాతూరి రమేష్, చుక్కల దినేష్, పడకంటి యాదగిరి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కూడలి ఏర్పాటుకు స్థల పరిశీలన

మహబూబ్‌నగర్ రూరల్: ఏనుగొండలోని అంబేడ్కర్ చౌరస్తా జాతీయ రహదారి 167 పై కూడలి ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశానుసారం స్థలాన్ని పరిశీలించామని, త్వరలోనే జంక్షన్ ఏర్పాటుచేస్తామని ఆయన తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తాను జంక్షన్‌గా మార్చేందుకు కలెక్టర్ ఆదేశించడంపై నాయకులు పురుషోత్తంగౌడ్, యాంకి రమేష్, కృష్ణ, వెంకట్, నర్సిములు, భాస్కర్, కాలె గోపాల్, మధు, గోపి, చంద్రయ్య హర్షం వ్యక్తంచేశారు.



ఏనుగొండలో స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాబోయే వేసవి కాలంలో ప్రజలకు నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని 'భగీరథ' ఈఈ పుల్లారెడ్డి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్, చౌదరపల్లి ఆయన పర్యటించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను పరిశీలించారు. పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. భగీరథ నీళ్ల సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే బోర్ల ద్వారా ప్రజలకు నీళ్ల సరఫరా చేసేందుకు సిద్ధం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 18005994007ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భగీరథ రూరల్ ఏఈ సతీష్, గ్రిడ్ ఏఈ ప్రణుషా, ఇంట్రా అధికారి రంజిత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

యువత మత్తుకు బానిస కావొద్దు

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న మాచర్ల రాంబాబు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు అని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన క్రీడోత్సవం కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారికి క్రౌన్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తారని, అలాంటి వారు మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. 2040లో వికసితభారత్‌ను నిర్మించేందుకు, విశ్వగురుగా భారత్‌ను నిలిపేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంఘటన్ మంత్రి నరేంద్ర, మల్లికార్జున్, కన్వీనర్ నరేష్, సౌమ్య, సతీష్, శివసాగర్, శివ, వరుణ్, శివరాం, శావణి, సిద్ధు పాల్గొన్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.వెంకట్రాములు ఆరోపించారు. మంగళవారం ఆసంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. వలసల నివారణ కోసం ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగపడుతున్నా ఈపథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా బడ్జెట్ కేటాయింపులున్నట్లు ఎద్దేవా చేశారు. గతంలో కంటే కేటాయింపులు పెంచకుండా నామమాత్రంగా కేటాయించడంపై మండిపడ్డారు. కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కడియాల మోహన్, జగన్, హన్మంతు, భగవంతు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్రాములు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మహమ్మదాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ శాంతిబాయి, వైస్ ఎంపీపీ రాధారెడ్డి అన్నారు. కస్తూర్బా గురుకుల విద్యార్థినులు 21 నేషనల్ ఇన్విటేషన్ కరాటే పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటుచేశారు. వారు మాట్లాడుతూ బాలికలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మిబాయి, రాంలాల్, పవన్, రహీం ఉన్నారు.



చిట్టి చేతుల్లో గొడ్డలి

పలక, బలపంతో అక్షరాలు దిద్దాల్సిన చిన్నారుల చేతుల్లో గొడ్డలి దర్శనమిచ్చింది. బడికి పంపితే విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన తమ పిల్లలు గొడ్డలి పట్టి చెట్లను నరకటం చూసి తల్లిదండ్రులు అవాక్కయ్యారు. మంగళవారం నవాబుపేట మండలంలోని జంగమయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో బడి పిల్లలతో పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లను నరికించారు. ఈఅంశంపై ఆరాతీయాలని గ్రామస్తులు కోరారు.

– నవాబుపేట

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ

మహబూబ్‌నగర్ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంటి స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం ఆపార్టీ ఆధ్వర్యంలో పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆఫీస్ నుంచి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాలనరసింహ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో వేలాది మంది పేదలకు ఇంటి స్థలాలు లేవని అన్నారు. 523 సర్వేనంబర్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఘాన్సీరాంనాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో బాలకిషన్, సురేష్, డి.రాము, చాంద్‌పాషా, నరసింహ, పద్మావతి, రాజు, లక్ష్మణ్, మహేష్, రాములు, ఆనంద్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

అడ్డాకుల: మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. అడ్డాకులలోని ఎస్ఎస్‌వీ స్పిన్నింగ్ మిల్లు వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై అదుపు తప్పి ఆటో బోల్తా పడగా ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. బలీదుపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పద్మమ్మ భర్త నర్సింహ, మొగిలయ్య ఆటోలో అడ్డాకులకు బయలుదేరారు. స్పిన్నింగ్ మిల్లు సమీపంలో ఆటో బోల్తాపడగా వారికి గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా కేంద్రానికి తరలించారు.

కారు బోల్తా..

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్ సమీపంలో అడవి పందిని తప్పించబోయి కారు బోల్తా పడ్డ ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. వివరాలు.. చౌదర్‌గూడకి చెందిన శివలింగం అనే వ్యక్తి కారులో డ్రైవర్‌తో పాటు సోమవారం రాత్రి జిల్లా కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. కాకర్లపహాడ్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా అడవి పంది రావటంతో దాన్ని తప్పించబోయి కారు అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్‌తో పాటు శివలింగంకు గాయాలయ్యాయి. 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారును ఢీకొట్టిన కంటైనర్

అడ్డాకుల: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం కారును కంటైనర్ లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరికి గాయాలైనట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాకు చెందిన కృష్ణమూర్తి, రామమూర్తి, మరొకరితో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. అడ్డాకుల సమీపంలోని అన్నపూర్ణ హోటల్‌వద్ద కారును హర్యానా వెళ్తున్న కంటెయినర్ లారీ ఢీకొట్టింది. దీంతో రామమూర్తికి గాయాలు కాగా మిగిలిన ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తికి జరిమానా, జైలు శిక్ష

నవాబుపేట: మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి రూ.5వేల జరిమానా, జైలు శిక్ష పడిందని ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన పిచ్చకుంట్ల వెంకటయ్య అనే వ్యక్తి సోమవారం నవాబుపేటలో మద్యం మత్తులో బైక్ నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం కోర్టుకు తరలించగా అతడికి రూ.5 వేల జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించిదని ఎస్‌ఐ తెలిపారు.

వివాహితపై లైంగిక దాడి.. కేసు నమోదు

నవాబుపేట: మండలంలోని ఓ గిరిజనతండాకు చెందిన వివాహితపై అదే తండాకు చెందిన శంకర్‌నాయక్ అనే వ్యక్తి సోమవారం లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గిరిజనతండాకు చెందిన వివాహిత పొలానికెళ్లి పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా శంకర్‌నాయక్ ఆమెపై లైంగిక దాడి చేశాడు. బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బీపీహెచ్ఎస్ పాఠశాలలో శ్రీకారం ఫౌండేషన్, సాత్విక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శశిబాబు, మల్లేష్, అశ్వినీచంద్రశేఖర్, రామలింగం, నాగేంద్రమ్మ, పరమేశ్వరీ, మాధురి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి ప్రణాళికలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని అన్నివార్డుల్లో సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత తెలిపారు. మంగళవారం కౌన్సిలర్లతో కలిసి 2, 11, 19వార్డుల్లో ఆమె పర్యటించారు. అక్కడ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మురికి కాల్వలను పరిశీలించి సీసీ రోడ్ల నిర్మాణం, పరిశుభ్రత అంశాలను ఆరాతీశారు. పాతబజార్ గాంధీ చౌరస్తా వద్ద కొద్దిరోజులుగా పైప్‌లైన్ లీకేజీతో నీటి వృథా అవుతుండటాన్ని ఆమె పరిశీలించారు. అక్కడినుంచే 'భగీరథ' ఏఈతో మాట్లాడి లీకేజిని అరికట్టేందుకు మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. కౌన్సిలర్లు బుక్క మహేష్, కుమ్మరి రాజు, ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్, జ్యోతి పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో పద్యపోటీలు

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం స్కూల్‌కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమికస్థాయి పాఠశాలలకు పద్యపోటీలు నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన పద్యపోటీలకు ముఖ్యఅతిథిగా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతప్ప హాజరయ్యారు. 'పద్యాలు పండితుల మాణిక్యాలు–వాటిని కాపాడటం మన బాధ్యత' అన్న అంశంపై పోటీలు జరిగాయి. పోటీలకు ఆయా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు హాజరై విద్యార్థులను అభినందించారు. పోటీలలో సింధూజ, ప్రశాంతి, నీహరిక, అంకిత, సుహాసిని, భానుప్రకాష్, కీర్తన, లోహిత్, మన్వితలు బహుమతులు సాధించారు.

మన్యంకొండకు పాదయాత్ర

దేవరకద్ర: రథసప్తమి పురస్కరించుకుని పలువురు భజన మండలి సభ్యులు, మహిళలు మంగళవారం మన్యంకొండకు పాదయాత్రను నిర్వహించారు. మండలంలో అడవి అజిలాపూర్ నుంచి ప్రారంభించిన పాదయాత్ర నాగారంగేట్, బస్వాపూర్ గేట్ మీదుగా మన్యంకొండకు కొనసాగింది. భజన మండలి సభ్యులు, మహిళా భక్తులు కాషాయ కండువాలను వేసుకొని పాదయాత్ర చేపట్టారు. దాదాపు 20 కిలోమీటర్ల మేర ఈపాదయాత్ర కొనసాగి చివరకు మన్యంకొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి చేరుకోగా అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్యాన్సర్‌పై అవగాహన

పాలమూరు: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి డి.ఇందిర హాజరై మాట్లాడారు. క్యాన్సర్ రాకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో లైంగిక వేధింపులపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థల పరిశీలన

దేవరకద్ర: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే డిగ్రీ కళాశాల కోసం మంగళవారం తహసీల్దార్ కృష్ణయ్య స్థలాన్ని పరిశీలించారు. గత విద్యాసంవత్సరం దేవరకద్రలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జూనియర్ కళాశాల భవనంలోనే తరగతులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం తహసీల్దార్ చెరువు కట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. దీని పక్కనే 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఇటీవలే మంత్రి శంకుస్థాపన చేశారు. హైవేకి సమీపంలోనే ఉండడంతో ఇక్కడ స్థలం లభిస్తే కళాశాల నిర్మించే అవకాశముంది.